సాక్షి
గుంటూరు

మంగళవారం । 7 । నవంబర్ । 2023



ప్రాతఃకాల అభిషేకాలు
భట్టిప్రోలు: పెదపులివర్రులో కొలువైన రాజరాజ నరేంద్రస్వామికి సోమవారం ప్రాతః కాలంలో అభిషేకాలు నిర్వహించారు. స్వామి దివ్యకాంతులతో దర్శనమిచ్చారు.



అమరేశ్వరుని సేవలో..
అమరావతి: అమరేశ్వరాలయాన్ని సోమవారం ఐఆర్ఎస్ అధికారులు మిథాలి మధు స్మిత, చార్య, వీరేందర్, సునీత, రవికిరణ్, నరేష్, సురేష్, కృష్ణమూర్తి, కిషోర్ దర్శించుకున్నారు.

జలపాలేశ్వరుడికి విశేషపూజలు


ఫిరంగిపురం: వేములూరిపాడులోని జలపాలేశ్వర స్వామికి సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే నమకచమకాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్త్రనామ పూజలు చేశారు.

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న నవోదయ ప్రవేశాల గడువు



యడ్లపాడు: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి మంగళవారంతో గడువు ముగుస్తుందని పల్నాడు జిల్లా మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ ఎన్.నరసింహారావు తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదివే విద్యార్థులు 2009 మే 1 నుంచి 2011 జులై 31 మధ్య, అలాగే 10వ తరగతి వారు 2007 జూన్ 1 నుంచి 2009 జులై 31 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలన్నారు.

ప్రత్తిపాడులో 9.2 మి.మీ వర్షం


కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 9.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.6 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు మండలంలో 6.6 మి.మీ., తెనాలి 6, దుగ్గిరాల 4.8, కొల్లిపర 3.4, చేబ్రోలు 1.2, వట్టిచెరుకూరు 1.2, గుంటూరు పశ్చిమ 1, మేడికొండూరు మండలంలో 0.8 మి.మీ చొప్పున వర్షం పడింది.

ముమ్మర సాధన



సాక్షి విజయవాడ : ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో ఉన్న డీవీఆర్, సీపీ క్రికెట్ మైదానాల్లో అండర్–19 పురుషుల అంతర్జాతీయ క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నీని ఈ నెల 13 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే విజయవాడ చేరుకున్న ఇంగ్లాండ్ జట్టు క్రీడాకారులు కెప్టెన్ బెన్ మెక్కిన్నీ పర్యవేక్షణలో మూలపాడు స్టేడియంలో సోమవారం ముమ్మరంగా సాధన చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) పర్యవేక్షణలో జరిగే ఈ టోర్నమెంట్‌లో ఇండియా–ఏ, ఇండియా–బీ, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్ జట్లు తలపడతాయి. బంగ్లాదేశ్, ఇండియా జట్లు ఈ నెల 11వ తేదీన విజయవాడ చేరుకుంటాయి.

యార్డుకు 28,283 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 28,283 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 24,409 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.23,800 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,700 నుంచి రూ.24,400 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,537 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 842.00 అడుగుల వద్ద ఉంది.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4,610 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 202, బ్యాంక్ కెనాల్‌కు 1,196, తూర్పు కెనాల్‌కు 565, పశ్చిమ కెనాల్‌కు 225, నిజాంపట్నం కాలువకు 340, కొమ్మమూరు కాల్వకు 2001 క్యూసెక్కులు విడుదల చేశారు.

కొండకు పండుగ శోభ

- వారం పాటు పండుగలు, విశేష పర్వదినాలు
- 12 నుంచి 18 వరకు ప్రత్యేక సేవలు
- 15న దుర్గమ్మకు గాజుల అలంకరణ
- 16న సరస్వతీ యాగం, 17న నాగుల చవితి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కనకదుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రికి పండుగ శోభ వచ్చింది. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు పండుగలు, విశేష పర్వదినాల నేపథ్యంలో దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 12వ తేదీ దీపావళితో ప్రారంభమయ్యే వేడుకలు 18వ తేదీ వరకు కొనసాగుతాయి. వరసగా వారం రోజుల పాటు విశేష పర్వదినాలు, పండుగలు రావడం ఇదే తొలి సారి.

12న దీపావళి

దుర్గమ్మ సన్నిధిలో 12వ తేదీ దీపావళి వేడుకలు నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం అమ్మవారికి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగిస్తారు. ఆలయ ప్రాంగణంలో బాణసంచా కాల్చి దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

13న ఆర్జిత సేవలకు డిమాండ్

అమావాస్య నేపథ్యంలో అమ్మవారి సన్నిధిలోని యాగశాలలో నిర్వహించే పలు ఆర్జిత సేవలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున అమ్మవారి అంతరాలయంలో నిర్వహించే ఖడ్గమాలార్చన, చండీ హోమంతో పాటు లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చనకు భక్తుల నుంచి డిమాండ్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా చండీ హోమానికి రికార్డు స్థాయిలో భక్తులు హాజరవుతారు. అమావాస్య రోజున సుమారు 300లకు పైగా టికెట్లను దేవస్థానం విక్రయిస్తుంది. యాగశాలలో అంత మంది భక్తులు కూర్చునే అవకాశం ఉండదు. ఆరు బయట కూర్చుని తమ గోత్రనామాలతో పూజ జరిగితే చాలు అని భక్తులు భావిస్తారు. దీపావళి అమావాస్య నేపథ్యంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

14న కార్తిక మాసోత్సవాలు ప్రారంభం

ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మల్లేశ్వర స్వామి వారికి నిత్యపూజలు, అభిషేకాలు ప్రారంభం కానున్నాయి. కార్తిక మాసం సందర్భంగా మల్లేశ్వర స్వామికి నిత్యం సహస్ర లింగార్చన, రుద్రహోమం, ఊంజల సేవ జరుగుతాయి. సాయంత్రం మల్లేశ్వర స్వామి ఆలయం, నటరాజ స్వామి ఆలయం వద్ద ఆకాశదీపాన్ని వెలిగిస్తారు. స్వామికి కార్తిక సోమవారాలు, ఏకాదశి, మాస శివరాత్రి పర్వదినాల్లో బిల్వార్చన జరుగుతుంది. 26వ తేదీ కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం, 27వ తేదీ సోమవారం కార్తిక పౌర్ణమి గిరి ప్రదక్షిణ, బిల్వార్చన జరుగుతాయి.

దుర్గమ్మకు గాజుల అలంకారం

యమ ద్వితీయ, భగిని హస్త భోజనాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గాజులతో విశేష అలంకరణ జరుగుతుంది. ఉత్సవంలో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌తో పాటు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని గాజులతో విశేషంగా అలంకరిస్తారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం మొత్తాన్ని రంగు రంగుల గాజులతో ముస్తాబు చేస్తారు. ఉత్సవం ముగిసిన అనంతరం అమ్మవారికి అలంకరించిన గాజులను క్యూలైన్‌లో భక్తులకు పంపిణీ చేస్తారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం అవసరమైన గాజులను దాతలు, భక్తులు దేవస్థానానికి విరాళంగా అందజేయొచ్చు.

16న సరస్వతీ యాగం

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని 16వ తేదీన ఇంద్రకీలాద్రిపై అమ్మవారి సన్నిధిలో సరస్వతి యాగాన్ని నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఈ యాగాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహిస్తారు. యాగంలో పాఠశాల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంది. యాగంలో పాల్గొన్న విద్యార్థులకు అమ్మవారి చెంత ఉంచి పూజలు నిర్వహించిన పెన్నులను పంపిణీ చేస్తారు.

17న నాగుల చవితి

కార్తిక శుద్ధ చవితిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రస్వామి పుట్ట వద్ద ఈ నెల 17వ తేదీన స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని జంట నాగేంద్ర స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతాయి.

18వ తేదీన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం ఈ నెల 18వ తేదీన జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై స్వామి కల్యాణ వేడుకను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని స్వామి ఆలయం నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు, కల్యాణం అనంతరం నిర్వహించే ఊరేగింపులో పల్లకి మోసేందుకు భక్తులు ఎంతో ఆసక్తిని చూపుతారు. స్వామి కల్యాణంలో పాల్గొన్న వారికి కల్యాణ యోగం, సంతానం లేని వారికి సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.

శస్త్రచికిత్సలు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో అవసరమైన ప్రజలకు వైద్యుల ద్వారా శస్త్రచికిత్సలు రిఫర్ చేస్తే వీలైనంత త్వరగా వాటిని పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సలకు ప్రభుత్వ వాహనంలో తీసుకెళ్లి తిరిగి అదే వాహనంలో వారి ఇంటి వద్దకు చేర్చాలన్నారు. శస్త్ర చికిత్సల ప్రక్రియ వచ్చే నెల 15 నాటికి పూర్తి చేయాలన్నారు. దీంతోపాటు గ్రామాల్లో, పట్టణాల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తించాలన్నారు. వారికి విలేజ్ హెల్త్ కేంద్రాల ద్వారా మందులు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మందులు, సంపూర్ణ పోషణం ప్లస్ ద్వారా తగిన ఆహారం అందించాలన్నారు. ఎనీమిక్ పేషెంట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు మాట్లాడుతూ బీపీ పరీక్ష పరికరాలు వెయ్యి కొనుగోలు చేశామన్నారు. ప్రతి పీహెచ్‌సీలో అదనంగా ఒకటి ఉండేట్లు చూసుకోవాలని చెప్పారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు కూడా బాగా పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చైన్‌డ్రాగింగ్ బోట్ ప్రాజెక్టుకు నగదు ప్రోత్సాహం



ప్రాజెక్ట్ రూపకర్త డాక్టర్ తౌసీఫ్ అహ్మద్‌ను అభినందిస్తున్న వీసీ పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ రూపొందించిన చైన్ డ్రాగింగ్ బోట్ ప్రాజెక్టుకు నగదు ప్రోత్సాహం లభించింది.

సంకల్ప్ – 2020 ప్రోగ్రాంలో భాగంగా ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ పోషన్ ఇంక్యుబేటర్ నుంచి రూ.5 లక్షల ప్రోత్సాహక బహుమతి అందింది. ఈ సందర్భంగా తౌసీఫ్ అహ్మద్‌ను సోమవారం వీసీ పి.రాజశేఖర్, రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సిద్దయ్య, ఇజనీరింగ్ డీన్ ఇ.శ్రీనివాసరెడ్డి, మెకానికల్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ తిరుమల రావు, ఐక్యుఏసీ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.గోపికృష్ణ తదితరులు అభినందించారు.

లేపాక్షిలో ప్రమిదల విక్రయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దీపావళిని పురస్కరించుకుని గాంధీనగర్ లేపాక్షి ఎంపోరియంలో ప్రమిదల ప్రదర్శన, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజర్ ఎం.సురేష్ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి తెప్పించిన టెర్రకోట (ఎర్రమట్టి) కుందన్ డిజైన్స్ మైనంతో నింపి తయారు చేసిన సరికొత్త అందమైన దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని వివరించారు. ఈ దీపాలు గిఫ్ట్ బాక్సుల్లో లభ్యమవుతాయని తెలిపారు. దీపావళి పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఉజిలిపేటలో విషాదం

పసికందు సహా అమ్మమ్మ దుర్మరణం

- మృత్యురూపంలో దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు
- నాలుగురోజుల్లో నామకరణం అనగా ఘోరం
- విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో దుర్ఘటన



చీరాలలో కుమారి నివాసముంటున్న అద్దె ఇల్లు

చీరాల అర్బన్: కూతురు, మనవళ్లతో కలిసి ఆనందంగా సొంతూరుకు బయలుదేరిన ఆ మహిళ మురిపెం అంతలోనే రక్తపుమడుగులో తడిచిముద్దయింది. ఒడిలో ఆరునెలల మనవడితో అంతసేపూ సంతోషంగా గడిపిన ఆమెను చూసి మృత్యువు కన్నుకుట్టిందో ఏమో.. క్షణకాలంలో భీకర శబ్దంతో బస్సు రూపంలో దూసుకొచ్చింది. మరో వ్యక్తి, పసికందుతో సహా ఆమెను అనంత లోకాలకు తీసుకెళ్లింది. ఈ హృదయ విదారక ఘటన విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో సోమవారం ఉదయం జరిగింది. ఫలితంగా చీరాల ఉజిలిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. చీరాల ఉజిలిపేటలో మోటాని కుమారి (50) కొన్నేళ్లుగా అద్దెకు నివాసముంటుంది. ఆమె భర్త విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసి గత ఏడాది మరణించాడు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమార్తె ఝాన్సీ గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో భర్తతో కలిసి ఉంటుంది. ఆమెకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడి వయసు 6నెలలు. నాలుగు రోజుల్లో ఆ బిడ్డకు నామకరణం చేయాలని కుటుంబ సభ్యులు భావించారు. ఈ నేపథ్యంలో కూతురు, మనవళ్లను చీరాలకు తీసుకొచ్చేందుకు ఆదివారం కుమారి, ఆమె కోడలు సుకన్య వడ్డేశ్వరం వెళ్లారు. సోమవారం తిరిగి కూతురు, మనవళ్లు, కోడలుతో కలిసి కుమారి చీరాలకు వచ్చేందుకు విజయవాడ బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడ బస్సు కోసం వేచి ఉన్న సమయంలో చిన్నమనవడిని ఒడిలో కూర్చోబెట్టుకుని కుమారి ఆడిస్తుండగా ఒక్కసారిగా విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే ఆర్టీసీ బస్సు ప్లాట్‌ఫాంపైకి దూసుకొచ్చింది. అమాంతం అక్కడే ఉన్న కండక్టర్‌ను ఢీకొని రెయిలింగ్ వెనుక కూర్చొని ఉన్న కుమారిని ఢీకొంది. ఈ ఘటనలో బస్ కండక్టర్‌తోపాటు కుమారి, ఆమె ఒడిలో ఉన్న పసికందు మరణించారు. రక్తపుమడుగులో పడి ఉన్న తల్లి, కన్నబిడ్డ దేహాలను చూసి ఝాన్సీ సొమ్మసిల్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కుమారి కుమారుడు హుటాహుటిన విజయవాడ బయలుదేరి వెళ్లాడు. కుమారి, ఆమె మనువడు మరణించారన్న విషయం తెలుసుకున్న స్థానికులు విషాదంలో మునిగిపోయారు. కూతురు, మనవళ్లను తీసుకొచ్చి నామకరణం చేయించబోతున్నానని సంతోషంగా చెప్పి వెళ్లిన కుమారి విగతజీవిగా వస్తుందని తెలిసి కన్నీరుమున్నీరు అవుతున్నారు.

జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్‌కు మోక్షం



గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదేళ్ల నుంచి మూలనపడ్డ సర్వీస్ బ్లాక్‌కు మోక్షం లభించింది. నాలుగు నెలల నుంచి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం చేసిన యత్నాలు సఫలీకృతమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ సోమవారం సర్వీస్ బ్లాక్‌ను పరిశీలించారు. ఈ బ్లాక్‌లో రేడియాలాజి విభాగాన్ని ఆధునికీరించాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ 2018లో సర్వీస్ బ్లాక్ రూ.2.5 కోట్లు వెచ్చించి ప్రారంభించినట్లు తెలిపారు. కోవిడ్ వల్ల మధ్యలో ఆపాల్సి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లడంతో వారు అనుమతులు ఇచ్చారని చెప్పారు. హెచ్‌డీ ఎస్ ఛైర్మన్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల రూ.7.5 కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. సర్వీస్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు పూర్తిగా రేడియాలజీ విభాగానికి కేటాయించనున్నట్లు చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సీటీ స్కాన్, ఎమ్మారై కోసం గదులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్‌బీకేల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కేంద్ర ప్రభుత్వ క్యాలిటీ కంట్రోల్ జేడీ అమిత్‌సింగ్
- అంగలకుదురులో ఆర్బీకే–2 పరిశీలన



అంగలకుదురు ఆర్బీకేలో కియోస్క్ యంత్రాన్ని పరిశీలిస్తున్న అమిత్‌సింగ్

తెనాలిటౌన్: రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కేంద్ర ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ క్వాలిటీ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ అమిత్‌సింగ్ తెలిపారు. ఆర్బీకేల్లో ఐఎస్ఓ సర్టిఫికెట్ తనిఖీ, నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణలో భాగంగా రూరల్ మండలం అంగలకుదురులోని ఆర్బీకే–2ను కేంద్రకమిటీ సభ్యులు సోమవారం సందర్శించారు. క్వాలిటీ కంట్రోల్ అసోసియేట్ మేనేజర్ సౌరభ్ సుమన్, ఆర్బీకేల డీడీఏ డి.వెంకటేశ్వర్లు ఉన్నారు. తొలుత వీఏఏ సాయిదీపిక, సిబ్బందితో అమిత్‌సింగ్ మాట్లాడారు. ఏయే పథకాలు అమలు చేస్తున్నారు, రైతులకు అందించే సబ్సిడీ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో రైతులతో సౌరభ్ సుమన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా అందుతున్నాయా, రైతు భరోసా సాయం వస్తుందా, కేంద్రంలో ఎరువులు అమ్ముతున్నారా అని అడిగారు. అన్నీ సక్రమంగా అందుతున్నాయని రైతులు తెలిపారు. పురుగు మందులను ఆర్బీకేలో అమ్మాలని, బయట కొనుగోలు చేస్తుంటే ఎక్కువ ఖర్చు అవుతుందని రైతు మండ్రు ఏసోబు, మరి కొందరు రైతులు కమిటీ సభ్యులకు తెలియజేశారు.

ఎరువుల స్టాక్ బోర్డును ఏర్పాటుచేయాలి....

అనంతరం ఎరువుల గోడౌన్‌ను కేంద్రకమిటీ సభ్యులు పరిశీలించారు. ఎరువులను తనిఖీ చేశారు. ఏయే కంపెనీల ఎరువులను అమ్ముతున్నారు, ఎంత ధరలకు విక్రయిస్తున్నారు, ఎన్ని బస్తాల ఎరువులు ఉన్నాయి అని వీఏఏ సాయిదీపికను అడిగారు. ఎరువుల స్టాక్ బోర్డును ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీని ఏర్పాటు చేయాలని అమిత్‌సింగ్ సూచించారు. కమిటీ సభ్యుల వెంట తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి, ఏఓ.జి.ప్రేమసాగర్ ఉన్నారు.

రేపటి నుంచి ఎస్ఆర్ఎంలో అంతర్జాతీయ సదస్సు

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలోగల ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 8, 9 తేదీలలో యాంటీబయోటిక్స్ అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వీసీ డాక్టర్ మనోజ్ కుమార్ అరోరా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 40 మంది శాస్త్రవేత్తలు, దేశంలోని వివిధ యూనివర్సిటీలు, పరిశోధనాసంస్థల నుంచి 200 మంది విద్యార్థులు హాజరై సదస్సులో తమ అనుభవాలను పంచుకోనున్నట్లు తెలిపారు.

ఇంటర్ కళాశాలల బాస్కెట్ బాల్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

గుంటూరు రూరల్: క్రీడలు శారీరక, మానసిక శక్తితోపాటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహదపడతాయని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజీస్ బాస్కెట్ బాల్ (మెన్ అండ్ ఉమెన్) టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో ఏఎన్‌యూ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ జాతీయ జట్టులో స్థానం సంపాదించే దిశగా క్రీడలో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ విజయసాధనే లక్ష్యంగా క్రీడాకారులు ఆడాలన్నారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన క్రీడాకారులకు ఏఎన్‌యూ బాస్కెట్ బాల్ (మెన్ అండ్ ఉమెన్) జట్ల తరపున జాతీయ స్థాయిలో ఈనెలలో త్రివేండ్రంలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఆడేందుకు అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస రావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ యోగా కో–ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ, కళాశాల పీడీ డాక్టర్ పి.గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, టీం మేనేజర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు సీటీ స్కాన్ మిషన్ మంజూరు

రూ.3.94 కోట్లతో కొనుగోలుకు అనుమతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నూతనంగా 16 స్లైసెస్ సీటీ స్కాన్‌ను మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన సీటీ స్కాన్ మిషన్ కొనుగోలుకు రూ.3,94,23,000 మంజూరు చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్ట్ రివాల్వింగ్ ఫండ్స్ ద్వారా సీటీ స్కాన్ మిషన్‌ను కొనుగోలు చేయాలంటూ ఉత్తర్వుల్లో వెల్లడించారు. జీజీహెచ్‌లో కొంతకాలంగా మిషన్ తరచూ మరమ్మతులకు గురవుతోంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ సిటీస్కాన్ వైద్య పరికరం ఆవశ్యకతను వివరిస్తూ జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తక్షణమే మంజూరుకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసి నిధులు సైతం ఇచ్చారు. అంతేకాకుండా పాత మిషన్ మరమ్మతులు చేయించేందుకు నిధులు మంజూరు చేసింది.

సివిల్ సమస్యలు కోర్టుల్లో పరిష్కరించుకోండి

జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వం అందించే సేవలను పొందేందుకు, సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమయ్యేందుకు ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆస్తులకు సంబంధించిన సివిల్ తగాదాలు పరిష్కరించబోమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ఇటీవల కుటుంబ పరమైన ఆస్తులకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఇటువంటివి సివిల్ కోర్టుల్లో తేల్చుకుని సరైన ఆర్డర్ వస్తే దాని ప్రకారం వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ఆర్డీఓను సంప్రదించాలన్నారు. సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ చట్టం ప్రకారం ఆర్డీఓ తక్షణ చర్యలు చేపట్టే వీలుంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యంగా వదిలేస్తే కఠిన చర్యలు తప్పవని చట్టాలు చెబుతున్నాయన్నారు. పేదల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హతలేని వారు అర్జీలు దాఖలు చేస్తూ తమ విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రేషన్ కార్డులో ఉన్న ఏ వ్యక్తికి అయినా ప్రభుత్వ ఉద్యోగం వస్తే కార్డులో ఉన్న వారంతా అనర్హులేనన్నారు. అనంతరం వచ్చిన 154 అర్జీలను జేసీ, డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, డెప్యూటీ కలెక్టర్ స్వాతి, జిల్లా అధికారులు పరిశీలించారు.

క్లుప్తంగా

ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్యాబ్‌లు పంపిణీ



నరసరావుపేట: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల చదువుకు ట్యాబులు ఎంతగానో ఉపయోగ పడతాయని జిల్లా కలెక్టర్‌ ఎల్‌.శివ శంకర్‌ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పల్నాడు జిల్లాలో 148 ట్యాబ్‌లను సమగ్ర శిక్ష అభియాన్‌ కార్యక్రమం కింద ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులకు 54, పిల్లలకు 94 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులకు విద్యను పరిపుష్టిగా అందించేందుకు ఈ ట్యాబ్‌లు సహాయపడతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్‌, సమగ్ర శిక్ష అభియాన్‌ విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు ధరించిన అధికారులు



నరసరావుపేట: నెలలో మొదటి వారం జిల్లా అధికారులంతా తప్పనిసరిగా చేనేత వస్త్రాలను ధరించి తమ కార్యాలయాలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్‌ శివశంకర్‌ లోతేటి సూచించారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా అధికారులంతా చేనేత వస్త్రాలను ధరించి జిల్లా కలెక్టర్‌ ఆఫీస్‌కు సోమవారం తరలివచ్చారు. జిల్లా కలెక్టర్‌ కూడా చేనేత వస్త్రాలను ధరించి రావడంతో, జిల్లా కార్యాలయం మొత్తం చేనేత వస్త్రాల సందడి కనిపించింది. దీంతో ఒక్కసారిగా కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్లయింది. ఇలా మొదటి వారం జిల్లా అధికారులంతా చేనేత వస్త్రాలను ధరించి రావడంతో నూతన వరవడి, సందడి నెలకొంది. చేనేత రంగానికి ప్రోత్సాహం ఇచ్చే ఉద్దేశంతో ఈ తరహా దిశగా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్‌ ప్రకటించారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించండి

నగరంపాలెం: వడ్డీల పేర్లతో పలువురు భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ బాధితులు వాపోయారు. అసలు, అపై వడ్డీలు చెల్లించిన ఇంకా చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్‌ కార్యాలయ ఆవరణలో సోమవారం 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమం జరగ్గా, బాధితుల నుంచి జిల్లా ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, ఎ.శ్రీనివాసరావు (క్రైం)లు అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత పోలీస్‌ అధికారులతో మొబైల్‌ఫోన్లు, వీసీ ద్వారా ఏఎస్పీలు మాట్లాడారు. అర్జీదారుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కారం చూపాలని చెప్పారు. ఎవరూ కూడా ఫిర్యాదిదారులతో అమర్యాదగా మాట్లాడవద్దని, వచ్చిన వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. సూచించారు. డీఎస్పీలు ప్రకాష్‌ బాబు (క్రైం), విజయశేఖర్‌ (ఎస్సీ ఎస్టీ సెల్‌), బాలసుందరరావు (ట్రాఫిక్‌) అర్జీలు స్వీకరించారు.



అర్జీదారుల సమస్యలను ఆలకిస్తున్న ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), శ్రీనివాసరావు (క్రైం)

తప్పుడు ఫిర్యాదులతో..

మూడేళ్ల క్రితం నలుగురు తెలిసిన మహిళలు వద్ద అప్పుగా రూ.2.50 లక్షలు తీసుకున్నా. క్రమేణా డబ్బులు చెల్లిస్తున్నా. గేదెలు సరిగ్గా పాలు ఇవ్వకపోవడంతో రెండు నెలలు ఆగాలని ప్రాధేయపడ్డా. అయినప్పటికీ ఇంటి వద్దకొచ్చి ఎప్పటికప్పుడు డబ్బులు ఇవ్వాల్సిందేనని నానాయాగీ సృష్టించారు. దీంతో ఇంటర్‌ చదివే కొడుకు శ్రీరామ్‌ (18) వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా, వారు జాలి చూప లేదు. ఏదైనా పని చేసి తమ డబ్బు చెల్లించాలని ఒత్తిడి తీసుకొచ్చి, కుమారుడ్ని ఓ కర్రీ పాయింట్‌లో పనికి కుదిర్చారు. ఓ నెల జీతం రూ.8 వేలు రాగా, అందులో రూ.6 వేలు చెల్లించగా, మిగతా రూ.2 వేలు ఇవ్వాలని బెదిరించారు. ఈ క్రమంలో నా పట్ల వారు అసభ్య పదజాలంతో మాట్లాడారు. వివాదం ముగిసి మేం పనులకు వెళ్లాక.. కొడుకు ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ తంతు ముగిశాక మళ్లీ ఆ మహిళలు వచ్చి నాపై దాడికి పాల్పడ్డారు. దీంతో వారిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదివ్వగా, బైండో వర్‌ చేశారు. ఇటీవల ఆ నలుగురిలోని ఓ మహిళ కుమార్తెతో నాపై మరో పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. రూ.5 లక్షలు అప్పుగా తీసుకుని చెల్లించడం లేదని ఫిర్యాదులో సారాంశం. అయితే ఆ మహిళలు దూషించడం వల్లే నా కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. న్యాయం చేయగలరు..

– పి.వెంకాయమ్మ,
వెంకట శ్రీనివాసరావు, తురకపాలెం.

రుణం పేరుతో మోసం..

పదేళ్లుగా వ్యాపారం చేస్తున్నా. కంపెనీ వ్యాపార దృష్ట్యా బ్యాంక్‌లో రుణం పొందేందుకు ప్రయత్నాలు చేస్తుండగా హైదరాబాద్‌ వాసి పరిచయమై, రుణం ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో తెలంగాణ నుంచి ఓ ప్రైవేటు ఫైనాన్స్‌ నుంచి పలువురు వ్యక్తులు వచ్చారు. రూపాయి వడ్డీతో పది కోట్ల రుణాన్ని రెండు విడతలుగా ఇప్పిస్తామని అన్నారు. అయితే ముందుగా రూ.47 లక్షలు వడ్డీ కింద జమ చేయాలని చెప్పారు. దీంతో వారి బ్యాంక్‌ ఖాతాలకు ఆన్‌లైన్‌ ద్వారా రూ.40 లక్షలు, ఈ ఏడాది మే నెల్లో చేతి రూపేణా రూ.7 లక్షలు చెల్లించా. అదిగాక విలువైన పత్రాలు తీసుకున్నారు. ఇటీవల మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి గుండెపోటుతో మరణించారు. దీంతో అవతలి వ్యక్తులు రుణం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు చెల్లించమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారు. పదే పదే అడిగితే చంపుతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. న్యాయం చేయగలరు..

– కె.తిరుమల సత్యశ్రీధర్‌,
తాడికొండ.

శాశ్వత ఉద్యోగిగా..

పదమూడేళ్లుగా జీజీహెచ్‌లో తాత్కాలిక ఆయమ్మగా విధులు నిర్వహిస్తున్నా. అక్కడే వార్డుబాయ్‌గా విధులు నిర్వర్తించే చుట్టుగుంట వాసి పరిచయమయ్యారు. ఆసుపత్రిలో శాశ్వత ఉద్యోగిగా చేయిస్తానని, అందుకు డబ్బులు చెల్లించాలని అడగ్గా.. విడతల వారీగా వార్డు బాయ్‌కి రూ.8 లక్షలు, 15 సవర్ల బంగారపు వస్తువులు యిచ్చా. నా వద్ద డబ్బులు, నగలు తీసుకుని సుమారు మూడేళ్లు గడిచింది. ఉద్యోగం విషయమై అడిగితే కాలయాపన చేశారు. ఇటీవల అతని భార్యతో స్థానిక పోలీసులకు నాపై ఫిర్యాదు చేయించాడు. నగదు, నగలు ఇవ్వకపోవగా తప్పుడు ఫిర్యాదులు చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారు. న్యాయం చేయగలరు..

– కె.లలితకుమారి,
సుద్దపల్లిడొంక, పాతగుంటూరు.

నేడు మూడుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

నరసరావుపేట: జిల్లాలో మంగళవారం మూడు చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్‌ బి.రవి సోమవారం పేర్కొన్నారు. దొండపాడు గ్రామంలోని ఆర్‌బీకే సెంటర్‌లో నిర్వహిస్తారన్నారు. అలాగే పట్టణంలోని షాలెంనగర్‌ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో యూపీఎస్‌ లాల్‌బహదూర్‌ స్కూలులో శిబిరం జరుగుతుందన్నారు. సత్తెనపల్లిలోని వెంగళరెడ్డి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హోలీ ఫ్యామిలీ స్కూలు ఆవరణలో నిర్వహిస్తారని వివరించారు.

9న రోప్‌ స్కిప్పింగ్‌ ఎంపికలు

ఈపూరు: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలలకు చెందిన అండర్‌–14,17 బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్‌ రోప్‌ స్కిప్పింగ్‌ ఎంపికలు మండలంలోని ఎ.ముప్పాళ్లలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శులు జి.ప్రతాప్‌ రెడ్డి, కోటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9గంటల కల్లా హాజరుకావాలని, అకడమిక్‌ మానిటరింగ్‌ ఏపీపీలో నమోదు చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు వై.వి.చిరంజీవి 9949579893 నంబరును సంప్రదించాలని సూచించారు.

15 మండలాల్లో వర్షం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని15 మండలాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది. సత్తెనపల్లిలో అత్యధికంగా 54.4 మి.మీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా చిలకలూరిపేటలో 0.6 మి.మీ వర్షం పడింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. మాచర్లలో 43.0మి.మీ, రెంటచింతలలో 8.6మి.మీ, పిడుగురాళ్లలో 3.0మి.మీ, బెల్లంకొండలో 3.6, అచ్చంపేటలో 12.6, క్రోసూరులో 1.4, నకరికల్లులో 18.4, బొల్లాపల్లిలో 7.2, వినుకొండలో 5.2, నూజెండ్లలో 4.8, నరసరావుపేటలో 2.6, నాదెండ్లలో 7.4, యడ్లపాడులో 1.2 మి.మీ వర్షం కురిసింది.

ప్రజా సంకల్పయాత్రతో సంక్షేమ రాజ్యం

- సుస్థిర పాలన తీసుకొచ్చింది జగనన్నే
- జెడ్పీ చైర్‌పర్సన్‌ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్‌: ప్రజా సంకల్పయాత్ర అపూర్వ విజయంతో ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి రాజన్న సంక్షేమ రాజ్యాన్ని సుస్థిరం చేశారని ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జెడ్పీ క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో మహానేత డాక్టర్‌ వై.ఎస్‌.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కేకు కట్‌ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్‌పర్సన్‌ బత్తుల అనురాధ పాల్గొన్నారు.

జగనన్న పాదయాత్రతో మారిన ఏపీ ముఖచిత్రం: డొక్కా మాణిక్యవరప్రసాద్‌

నగరంపాలెం: సీఎం వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రతో ఏపీ ముఖ చిత్రం మారిందని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌ అన్నారు. జననేత వై.ఎస్‌.జగన్‌ తలపెట్టిన ప్రజా సంకల్ప యాత్ర సోమవారంతో ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌ సీపీ గుంటూరు జిల్లా, ప్రాంతీయ కార్యాలయంలో డాక్టర్‌ వై.ఎస్‌.రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌ మాట్లాడుతూ గతంలో చైనాలో తలపెట్టిన లాంగ్‌ మార్చ్‌ ఒక లక్ష్యాన్ని సాధించిందని, అనేక సంస్కరణలకు నాంది పలికిందని అన్నారు. దీంతో ప్రపంచ దేశాలలో చైనా ఒకటిగా నిలిచిందని, అదే స్థాయిలో వైఎస్‌ జగన్‌ పాదయాత్రతో ఏపీ రూపురేఖలు మారాయన్నారు. పాదయాత్రకు ఒక సాధికారిత, గౌరవాన్ని యిచ్చిన ఏకైక వ్యక్తి సీఎం వై.ఎస్‌.జగన్‌ అని అన్నారు ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌, మేయర్‌ కావటి మనోహర్‌ నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో ఉప మేయర్‌ బాలవజ్రబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బత్తుల దేవానంద్‌, దివ్యాంగుల కార్పొరేషన్‌ చైర్మన్‌ ముంతాజ్‌ పఠాన్‌, కృష్ణ బలిజ కార్పొరేషన్‌ చైర్మన్‌ భవాని, రాష్ట్ర సోషల్‌ వెల్ఫేర్‌ డైరెక్టర్‌ గనిక ఝాన్సీ, స్టేట్‌ రోడ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ పిల్లి మేరీ, జిల్లా వైఎస్సార్‌ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



కేక్‌ కట్‌ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ కత్తెర హెనీ క్రిస్టినా, అనురాధ, ఉద్యోగినులు



రాజన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డొక్కా, మద్దాళి గిరిధర్‌

తెలుగుదేశం పార్టీ కోవర్టుగా పురందేశ్వరి

ఎమ్మెల్సీ సునీత ధ్వజం

చీరాల: రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి తెలుగుదేశం పార్టీకి కోవర్టుగా పనిచేస్తుందని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజమెత్తారు. సోమవారం ప్రజా సంకల్ప పాదయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్సీ వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి తన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పురందేశ్వరి తన తండ్రి ఎన్టీఆర్‌ మరణానికి కారణమైన వారికి శిక్షపడాలని ఏనాడు కోరలేదన్నారు. తండ్రి మరణానికి కారణమైన వారికి ఆమె అండగా నిలుస్తున్నారని విమర్శించారు. ఎన్టీఆర్‌ మరణంపై సీబీఐ చేత విచారణ చేపట్టాలని ఏనాడైన ఆమె కోరారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం పురందేశ్వరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలా లేదా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలా.. అని ప్రజలు విమర్శిస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు పురందేశ్వరి ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డిని ప్రశ్నించే అర్హత ఆమెకు లేదన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకొనే చంద్రబాబు రాష్ట్ర ప్రజలు గుర్తుపెట్టుకొనే ఒక సంక్షేమ పథకమైన చెప్పగలడా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడుని ఎప్పుడు అవినీతి, కుతంత్రాలు, వెన్నుపోట్లు, గజదొంగల ముఠా నాయకుడుగానే ప్రజలు గుర్తుపెట్టుకొన్నారని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన అనేక స్కాంల్లో కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ఆయన చేసిన స్కాములు విచారణ పూర్తయితే అయనకు జైలే గతి అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సునీత

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవాలి

- 10వ బెటాలియన్‌ ఎన్డీఆర్‌ఎఫ్‌ కమాండర్‌ ప్రదీప్‌కుమార్‌
- ఆకట్టుకున్న ఎన్డీఆర్‌ఎఫ్‌ మాక్‌డ్రిల్‌

చీరాల టౌన్‌: తుపాన్లు, వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో ఆపదలో ఉన్నవారిని రక్షించడంతో పాటు ప్రాణాలను కాపాడటంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని 10 బెటాలియన్‌ ఎన్డీఆర్‌ఎఫ్‌ కమాండర్‌ ప్రదీప్‌కుమార్‌ సూచించారు. సోమవారం మండలంలోని తీర ప్రాంత గ్రామమైన వాడరేవులోని జెడ్పీ హైస్కూల్‌ విద్యార్థులకు, గ్రామస్తులకు ప్రకృతి వైపరీత్యాలను ఏ విధంగా ఎదుర్కోవాలో జాతీయ విపత్తుల ప్రతిస్పందన (ఎన్‌డీఆర్‌ఎఫ్‌) 10 బెటాలియన్‌ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, మాక్‌ డ్రిల్‌ ఏర్పాటు చేశారు. కమాండర్‌ ప్రదీప్‌ కుమార్‌ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యాలు తరచుగా జరుగుతున్నాయని వీటిలో క్షతగాత్రులను ప్రాణాలతో కాపాడటంతో పాటుగా ప్రాథమిక చికిత్సలు అందించి ప్రాణనష్టం జరగకుండా ఎన్డీఆర్‌ఎఫ్‌ పోరాడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ విపత్కర సమయాల్లో బాధితులను కాపాడటంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందం నిత్యం ప్రకృతి విపత్తుల సమయాల్లో ప్రాణాలకు ఎదురొడ్డి అందిస్తున్న సేవలు, పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్‌ ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతి ఏటా నవంబర్‌, డిసెంబర్‌ నెలల్లో తుపాన్లు, భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయన్నారు. ఈ విపత్కర సమయాల్లో ఆపదలో చిక్కుకున్న వారిని రక్షించడంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌, లైఫ్‌ జాకెట్ల వినియోగం, అగ్ని ప్రమాదాల్లో బాధితులను కాపాడేందుకు వినియోగించే యంత్ర పరికరాలు, బోట్లు, కట్టర్లు, అధునాతన పరికరాల ప్రదర్శన వినియోగించే విధానంపై విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో ఆర్‌ఐ శేఖర్‌, హైస్కూల్‌ పీఈటీ ఎస్‌.రవి, గ్రామపెద్దలు అక్కల శ్రీనివాసరెడ్డి, మత్స్యకార సంఘాల నాయకులు, ఎన్డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది, సివిల్‌, ఏఆర్‌, మెరైన్‌, అంగన్‌వాడీ, మెడికల్‌ సిబ్బంది, హైస్కూల్‌ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామస్తులు, విద్యార్థులకు సూచనలందిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్‌ కమాండర్‌ ప్రదీప్‌

అండర్‌–17 ఎస్‌జీఎఫ్‌ సాఫ్ట్‌బాల్‌ రాష్ట్ర జట్లు ఇవే

ఒంగోలు: అండర్‌–17 స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ సాఫ్ట్‌బాల్‌ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్‌ సాఫ్ట్‌బాల్‌ అంతర్‌ జిల్లాల పోటీల పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు స్థానిక పీవీఆర్‌ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. పరిశీలకులు జగదీశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు సీహెచ్‌ సత్యనారాయణ (విజయనగరం), కె.గోపాల్‌రెడ్డి (అనంతపురం), కృష్ణకుమార్‌(కృష్ణాజిల్లా) ఈ రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్లు త్వరలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌ తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయి.

బాలుర రాష్ట్ర జట్టు: వై.లక్ష్మీ ప్రసన్న, ఎం.యశ్వంత్‌ (శ్రీకాకుళం), కె.ఆంజనేయులు (వైఎస్సార్‌ కడప), ఎస్‌.మధుసూదనరావు (శ్రీకాకుళం), పి.జనార్దన్‌రావు (విజయనగరం), ఎం.మనోజ్‌ (వైఎస్సార్‌ కడప), డి.రాఘవ (విజయనగరం), పి.మహీధర్‌ (వైఎస్సార్‌ కడప), బి.నారాయణస్వామి (అనంతపురం), బి.మహేష్‌ (పశ్చిమ గోదావరి), ఎం.ఆకాష్‌ (గుంటూరు), పి.యశ్వంత్‌(పశ్చిమగోదావరి), టి.నాగేంద్ర (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), పి.హరీష్‌సాయి (ప్రకాశం), బి.లక్ష్మణ్‌ స్వామి(విశాఖపట్నం), సీహెచ్‌ పీటర్‌ (ప్రకాశం), స్టాండ్‌బైలుగా ఎ.కార్తీక్‌ (గుంటూరు), కె.శశి (అనంతపురం), కె.హేమంత్‌ కుమార్‌ (కృష్ణా), డి.నవీన్‌ (వైఎస్సార్‌ కడప), కె.రోహిత్‌ (విజయనగరం).

బాలికల జట్టు: టి.ప్రశాంతి (విజయనగరం), ఎం.వీరనారాణమ్మ (వైఎస్సార్‌ కడప), సీహెచ్‌ అనిత (గుంటూరు), బి.సుప్రియ (విజయనగరం), ఎస్‌.సల్మ (ప్రకాశం), ఎం.శివ నాగలక్ష్మి (ప్రకాశం), పి.హైమావతి (విజయనగరం), ఎన్‌.బేబి (ప్రకాశం), జి.సునందిని(గుంటూరు), బి.నవ్యశ్రీ (కర్నూలు), కె.రాజేశ్వరి (అనంతపురం), జె.సంజన చౌదరి (ప్రకాశం), వి.యవంతిక(ప్రకాశం), కె.రిషిత (కృష్ణా), పి.రేణుక (శ్రీకాకుళం), ఎస్‌.భువనేశ్వరి (తూర్పు గోదావరి), స్టాండ్‌బైలుగా టి.కీర్తన (ప్రకాశం), పి.చైతన్య కుమారి (విజయనగరం), కె.రోజా (గుంటూరు), జి.నీల (విశాఖపట్నం), టి.సుకన్య (అనంతపురం).

రాష్ట్రస్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీల్లో ప్రథమస్థానం



అత్మకూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి కప్‌ తీసుకుంటున్న బాలికల జట్టు

శావల్యాపురం: రాష్ట్రస్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ క్రీడాపోటీల్లో శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల బాలికల జట్టు ప్రథమస్థానం సాధించినట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గుంటూరు జిల్లా బాలికల జట్టు ఫైనల్స్‌లో తూర్పు గోదావరి జట్టుపై విజయం సాధించినట్లు చెప్పారు. శావల్యాపురం జట్టు అండర్‌–17 విభాగంలో ఆకుమళ్ల సమీరా, కె.కావ్య, ఎం.లూధియా, వేముల దివ్య, ఉప్పు బసవరాణి పోటీల్లో ఐదుగురు పాల్గొన్నట్లు చెప్పారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు పీఎస్‌ఆర్‌ నెల్లూరు జిల్లా అత్మకూరు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని కప్‌తో పాటు రూ.70 వేలు నగదు బహుమతి దక్కించుకున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలకు అండర్‌–17 విభాగంలో శావల్యాపురం హైస్కూలు నుంచి కె.కావ్య, ఆకుమళ్ల సమీరా, వేముల దివ్యలు ఎంపికైనట్లు తెలిపారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శావల్యాపురం హైస్కూలు బాలికలు

నవోదయంలో కారు అందజేత

నరసరావుపేట: నవోదయం ద్వారా మంజూరైన కారును జిల్లా కలెక్టర్‌ ఎల్‌.శివశంకర్‌ సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. పట్టణానికి చెందిన నూతలపాటి రాజేంద్ర కుమార్‌ నవోదయం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారు. వైయస్సార్‌ జగనన్న బడుగు వికాసం కింద లబ్ధిదారునికి స్థానిక పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌ అధికారులు రుణం అందించేందుకు ముందుకు వచ్చారు. లబ్ధిదారునికి 45శాతం సబ్సిడీపై రూ.13.94 లక్షలు విలువ చేసే కారును అందించారు. జిల్లా కలెక్టర్‌ లబ్ధిదారునికి కారును ప్రారంభించి తాళాలను అందజేశారు. బ్యాంకు అధికారులను సన్మానించారు. జిల్లా లీడ్‌ బ్యాంకు మేనేజర్‌ వెంకటేశ్వర్లు, నవోదయం నోడల్‌ అధికారి సంజీవ రావు, ,జిల్లా పరిశ్రమల కేంద్రం వెంకటేశ్వరరావు, బ్యాంకు మేనేజర్‌ పాల్గొన్నారు.

తెనాలిలో ఆరంభమైన సంగీతోత్సవాలు

రసజ్ఞుల ప్రశంసలందుకున్న గాత్ర విద్వాంసుడు వివేక్‌ మొజికులమ్‌

తెనాలి: పట్టణానికి చెందిన ప్రసిద్ధ సంగీత సంస్థ శ్రీసీతారామ గానసభ శాస్త్రీయ సంగీత ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్‌ హాలులో సాయంత్రం 6.30 గంటలకు ఏర్పాటైన కార్యక్రమంలో తొలుత సంగీత వాగ్గేయకారులు త్యాగరాజస్వామి, శ్యామశాస్త్రిల చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. కొన్నేళ్లుగా అనివార్య కారణాలతో నిలిచిపోయిన గానసభ సంగీతోత్సవాలను పునఃప్రారంభించటం సంతోషంగా ఉందని అధ్యక్షులు పిరాట్ల రమణి అన్నారు.

ఏడు దశాబ్దాలు నిరాటంకంగా శాస్త్రీ య సంగీత మధురిమలను అభిమానులకు పంచిన సంస్థ, సంగీత సేవను కొనసాగించాలన్న అభిమతంతోనే పునరంకితమయ్యామని చెప్పా రు. సంగీత ఉత్సవాల్లో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ప్రముఖ గాయనీ గాయకులు శాస్త్రీయ సంగీతాన్ని సంగీతాభిమానులు ఆస్వాదించాలని కోరారు. కార్యదర్శి దుర్భా హరిబాబు మాట్లా డుతూ ఈనెల పదో తేదీ వరకు జరిగే సంగీతోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.



త్యాగరాజు, శ్యామశాస్త్రిల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించిన గానసభ పాలకవర్గం

అనంతరం తొలిరోజు సంగీత కార్యక్రమం ఆరంభించారు. కేరళకు చెందిన ప్రముఖ గాత్ర విద్వాంసుడు వివేక్‌ మొజికులమ్‌ గాత్ర కచేరీని ఏర్పాటుచేశారు. పలు వాగ్గేయకారుల కీర్తనలను మొజికులమ్‌ హృద్యంగా ఆలపించారు. దాదాపు రెండు గంటలకు పైగా సాగిన కచేరీతో రసజ్ఞుల కరతాళధ్వనులను అందుకున్నారు. చెన్నైకు చెందిన వాయులీన విద్వాంసుడు పప్పు జ్ఞానదేవ్‌ వయొలిన్‌పై, తెనాలి విద్వాంసుడు కేవీ రామకృష్ణ మృదంగంపై వాద్య సహకారం అందించారు. సంస్థ ఉపాధ్యక్షుడు దుర్భా కౌండిన్యసాయి, సహాయ కార్యదర్శి కేవీ రామకృష్ణ, కోశాధికారి పరుచూరి సుబ్బారావు పర్యవేక్షించారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా





న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజీమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజీద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజీమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజీమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజీమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజీమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజీమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజీద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజీమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావోపాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్‌‌ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!


రవితేజ

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

అనుష్క @ 50


అనుష్క

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్


కమల్ హాసన్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

\- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ - ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.


బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

\- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

\- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

\- దర్శకుడు మారేష్ శివన్

''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.

